

# నివేదిత

"పల్లెనిద్రే శ్రమం బడుగజారిన తామరపాకు పివరల్" పోలిన పిల్ల తెమ్మెరలు శరీరాన్ని స్పృశించి మనస్సును తేలి పోమ్మన్నట్టుగా అనిర్వచనీయమైన ఆనందానుభూతి పొందుతున్నాను. ప్రపంచం అంతా ముందుకు సాగిపోయి నవ్యతనే ఆరాధిస్తున్న రోజులే అయినా, ఇంకా పల్లెటూళ్ళలోని కోడికూతలు అలాగే ఉండిపోయినట్టున్నాయి! తూర్పు బజారున ఓ కోడి "కొక్కొరో కో!" అని కేక వేసింది. దక్షిణపు బజారునుండి మరో కోడి కూసింది. దాన్ని అనుసరించి మరొకటి పశ్చిమ దిక్కునుండి, దానివెంటనే ఉత్తరపు వీధి నుండి మరొకటి కూతలు పెట్టాయి. చెరువు కట్టమీది రావిచెట్టుపై ఉన్న పక్షిసముదాయం అంతా ఓ మారు గగ్గోలుగా లేచింది. కొంగలు కొరకొరమంటూ ఓ నాలుగు చుట్లు చుట్టి మళ్ళీ చెట్ల మీద వాలాయి. పిచ్చుకలూ, పావురాలూ, గోరువంకలూ అన్నీ తమ తమ భాషల్లో కిలకిలారావాలు చేస్తుంటే, మధురాతిమధురంగా, కర్ణపేయంగా వినిపించాయి, ఆ సుందర ధ్వనులు. ఆ పక్షిసంతతి అంతా బహుశా స్వకీయ భాషలో ప్రభాత సేవ చేస్తున్నవేమో! ఆ చల్లని వాయు వీచికలకు ఆనందించినట్లు చెట్లన్నీ పరవశంగా కదిలి కదలనట్లు కదిలి, ఆకుల రెపరెపలు వినిపించాయి. దొడ్డిలో కట్టివెయ్యబడిన గోమాత అంభారవాన్ని వినిపించింది. వసారాలో ఉన్న బుజ్జాయి "అమ్మా!" అంది తన భాషలో. ప్రశాంతమైన ప్రకృతి చైతన్యవంతం కాబోతున్న ఆ ఉషః కాలంలోని విశిష్ట సౌందర్యం మనస్సుల నాకట్టి స్పష్టంగా కనిపిస్తున్నది. నిద్రాణంగా ఉన్న ప్రకృతి చుక్క పొడుపుతో విశ్రాంతి చాలు అన్నట్లు ఒళ్ళు విరుచుకొని నవ్యతను దొరకపుచ్చుకొని లేచి వస్తున్నట్టు అగపడుతూంది. ఆ ప్రాతఃకాల సౌందర్యాన్ని ఎప్పుడో ఆ పల్లెలో ఊహ తెలిసీ తెలియని వయస్సులో అనుభవించీ అనుభవించకుండానే అనుభవించాను. ఇప్పుడు

ఆంధ్ర ప్రభ

సచిత్ర వారపత్రిక

*1965, నవంబరు 1 నుంచి*

**కొత్త ప్రకటన రేట్లు**

**కాజువల్:** కాలం సెం. మీ. 1 కి 7—50

**కంట్రాక్టు:** కాలం సెం. మీ. 1 కి రు. 6–80

(250 సెం. మీ. లు, ఆ పైన)

(ప్రకటనకు కనీస స్థలం సిం. కాలం—5 సెం. మీ. లు)

**అట్ట పేజీలు**

**4 వ పేజీ-రెండు రంగులు**

**కాజువల్:** ప్రకటన 1 కి రు. 1100/—

**కంట్రాక్టు:** ప్రకటన 1 కి రు. 950/—

(కనీసం 6 ప్రకటనలు)

**2 వ పేజీ, 3 వ పేజీ—ఒక రంగు**

**కాజువల్:** ప్రకటన 1 కి రు 700/—

**కంట్రాక్టు:** ప్రకటన 1 కి రు. 600/—

(కనీసం 6 ప్రకటనలు)

**కొలతలు:**

కాలం వెడల్పు 5 సెం. మీ.

కాలం నిడివి 23 సెం. మీ.

పేజీకి 3 కాలంలు

*ఇతర వివరములకు దిగువవారికి వ్రాయండి:*

**అడ్వర్టయిజ్‌మెంట్ మానేజర్,**

ఆంధ్రప్రభ

సచిత్ర వారపత్రిక

**ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు- 2**


# నివేదిత

తిరిగి ఎంత కాలానికో అనుభవిస్తున్నాను. ఆ ఆనందానుభూతి నన్ను వదిలిపోతుందేమోనని భయపడి, తిరిగి మరెప్పుడయినా ఈ సౌఖ్యం వస్తుందో రాదో అని సంపూర్ణ ఫలాపేక్షతో ఊరి బయటివరకూ పోయి వద్దామని బయలుదేరాను. గంభీర ప్రశాంతత క్రమంగా తగ్గి పోతూంది. అక్కడా ఇక్కడా ఎవరో ఒకరి చెప్పుల మోతా, కర్రపోటూ, శబ్దం చప్పుడూ వినిపిస్తూనే ఉన్నాయి. మా సుందరమూర్తి వేణుగోపాలస్వామి ఆలయం దగ్గిర పడుతున్నట్లుగా మృదుమధుర గాత్రం ఒకటి అమృత ధారలు వెలువరిస్తూ వినిపించ సాగింది.

"తెల్లవారవచ్చె తూరుపు తెలివండె
నల్లని నాసామీ! మేలుకో!
కృష్ణా! మేలుకో!"

సెలయేళ్లలా సాగి దివ్య స్రవంతుల్లా పారుతున్న ఆ భాగవత రమణీయ కథా ఘట్టాలు మేలుకొలుపులలో మధురతమంగా వినిపించి మైమరిపించసాగాయి. ఆ పాడుతున్న వ్యక్తి ఎవరో నేను పోల్చుకోలేకపోయాను. కాని ఎవరో అన్న ఉత్సుకత కొద్దీ ఆ ఆలయం ముందు ఆగాను. ప్రహారీలు లేని ఆ ఆవరణ అంతా చిమ్మి, నీరు చల్లుతూ గానం చేస్తూందా వ్యక్తి. దరిదాపు ఏభై ఏళ్లకు పైబడి ఉండవచ్చు. 'ఎవరా?' అనుకుంటూనే వెళ్ళిపోయాను.

ఆ సాయంత్రం గుడికేసి వెళ్ళాను. రఘునాచార్యులు తీర్థ ప్రసాదా లిచ్చారు. తురవాత "అక్కమ్మా!" అన్నారు. ఏభై ఏళ్ల పైబడ్డ స్త్రీమూర్తి గోపాల మూర్తికి నమస్కరించి తీర్థానికి చెయ్యి చాపింది. ఉదయ సంధ్యలో స్పష్టంగా కనిపించని వ్యక్తి స్పష్టంగా కనిపించింది. ఎందుకో నా మనస్సు తెలియకుండానే "దమ్మక్కమ్మ"ను జ్ఞాపకం చేసింది. ఆనాటి దమ్మక్కమ్మ దాశరథికి భద్రాద్రిలో సేవలు చేసి ఆ కరుణా పయోనిధి సాంగత్యాన్ని పొందిందట. ఇక్కడ ఈ అక్కమ్మ దమ్మక్కమ్మ అయి ఈ వేణుగోపాలమూర్తి వల్లని చూపులకని ఎదురు తెన్నులు చూస్తున్నదా? అనిపించింది.

నేను అలా మా పెదనాన్నగారి ఇంటికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి, "వెళ్లొస్తాను కామమ్మత్తా!" అంటూ లేస్తున్నది అక్కమ్మ.

"కూచోవే! పోదువుగాని!"

"కాదత్తా! అబ్బాయి వస్తాడు" అంటూ లేచి వెళ్లింది.

"ఎవరు నాన్నమ్మా?" అన్నాను.

"అది తెలియదుట్రా! అక్కమ్మ కదూ? మనవాళ్ల ఇంటి పక్క ఇల్లు. సూరయ్య పెళ్లాం" అంది. ఆలోచిస్తున్న నాకు అందించింది—"నీ వెరగవేమోలే వాడి మొదటి పెళ్లాం!" అంటూ.

"ఎరక్కేం? అప్పుడు . . . . . . . ."

"ఆ! అదే! ఇప్పుడెట్లా తయారైందనుకున్నావ్? దేవత అని అంతా చెయ్యెత్తి దణ్ణం పెడతారు దానికి" అంది నాన్నమ్మ. నన్ను నేను నమ్మలేకపోయాను.

ఇంట్లో నించి శారద వాయులీనంపైన శుద్ధరిషభాన్ని చక్కగా అంటూంది. ఆ ముందటి సాయంత్రమే శారదతో "పిళ్లారి గీతాలు బ్రహ్మాండంగా వాయిస్తున్నావు కాని, తల్లీ, నీవు వాయించే రిషభం శుద్ధ అపస్వరం" అని అన్నాను. పట్టుదలగా కూర్చొని సాధన చేసినట్టుంది, చెలగాటంగా వాయించేస్తూంది ఎక్కడ వస్తే అక్కడ. అర్ధమైనట్లల్లా సూక్ష్మాతిసూక్ష్మమైన అపస్వరాన్ని కూడా సర్ది సరిచేసికొనగల శక్తి అబ్బుతూంది. 'ఆత్మపరీక్షకు సవ్యమైన మనస్సుతో కూర్చోగలగాలి. అంతే' అనిపించింది.

* * *

ఎప్పుడో పాతిక ముప్ఫయి ఏళ్లనాటి సంగతి. ఆరోజుల్లో ఓరోజు తెల్లవారబోతూంది. "అక్కమ్మ తల్లీ! ఏమైనావే కూతురా!" అంటూ పెద్దగా ఏడుపు వినవచ్చింది. అంతా గల్లంతుగా ఏమిటో అని పరిగెత్తారు. కొందరు చంద్రయ్య బావికి పరిగెత్తారు; కొందరు అంకమ్మ బావికి, మరి కొందరు ఉప్పునీళ్ల బావికి గడలు వేశారు. తగిలిందంటే తగిలిందన్నారు. చేంతాళ్లూ, పాకులూ, పగ్గాలూ వేశారు; ఈతగాళ్లు దూకారు.

"నేనప్పుడే అనుకున్నా, బావిలో ఏదో పడ్డట్లు తెల్లారగట్ల పెద్ద చప్పుడైంది" అంది బావిపక్క ఇంట్లో ఉన్న అండాళ్లమ్మ. మేమూ విన్నామంటే మేమూ విన్నామన్నారు మరో పదిమంది. అక్కమ్మ తల్లి సుబ్బమ్మ గుండెలు బాదుకొంటూంది, నాలుగేళ్ల మనవరాల్ని చంకన వేసుకుని, ఆ బావి దగ్గిరకీ, ఈ బావి దగ్గిరకీ పరిగెడుతూ. అక్కమ్మ మొగుడు నిశ్చేష్టుడై కూర్చున్నాడు. "ఎంత గుండె నిబ్బరం గల మనిషి!" అని మెచ్చుకున్నారు కొందరు. "రాక్షసపు గుండె! కంటి వెంబడి తడి అయినా లేదు!" అని తిట్టారు కొందరు. కాస్సేపటికి అతని ఆప్తమిత్రుడు మల్లికార్జునుడు వచ్చాడు. అందర్నీ అవతలికి పంపాడు.

"అన్నీ ఉన్నాయా?" అన్నాడు. అంతదాకా నిబ్బరన్ని చూపిన సూరయ్య అంగలార్చాడు. "బంగారమేనా, డబ్బుకూడా ఏమైనా?. . . ." అన్న మల్లికార్జునుడికి రెండువేళ్లు చూపాడు. మల్లికార్జునుడు ఐదుగురు కుర్రాళ్లను సైకిళ్లమీద నాలుగు వైపులకు పంపాడు. నలుగురు కుర్రాళ్ళు ఎందుకు వెళుతున్నారని ఆలోచించిన చిన్న కరణం రంగయ్య తన సైకిలు ఎక్కాడు. ఆ సైకిలు వెంటనే మరో పది సైకిళ్లు పరిగెత్తాయి. "ఇన్నాళ్లూ పతివ్రతగా దొరక్కుండా తిరిగింది. ఈవేళ ఎక్కడికి పోతుంది?" అని ఉరుకులూ పరుగులూ తీశారు సైకిలు రౌతులు. అన్ని బాపులూ గాలించటమయింది. ఉదయం తొమ్మిది గంటలయ్యేసరికి ఊరు ఊరంతా గుప్పుమంది, "అక్కమ్మ సుబ్బారాయుడితో లేచిపోయిందిట!" అని. తూరుపు బజారు వాళ్లెవరో "మేము స్వయంగా చూచాం పోవటం" అన్నారు. నేను "ఎక్కడిదాకా?" అని అడిగాను. "బాపట్లలో మా అక్కయ్యను చూచి వద్దామని వెళుతున్నానండి. పక్కనున్న సుబ్బారాయుడు తోడు వెళుతున్నాడనుకున్నా!" అన్నాడో అబద్ధయ్య. "అప్పాపురం లాకుల ఒక్కత్తే పోతూంటే చూచా" అన్నాడో ఎల్లయ్య. అంతే! అంతకు ముందు బావిలో పడుతున్న

మహాసుఖం అనుభవించవచ్చు; ఒక మహాదుఃఖమె అనుభవించవచ్చు సాఫల్యం సిద్ధించవచ్చు; విధివంచనకు గురికావచ్చు. ఏమైనా జీవితపు అగాధాలు, అంచులు రుచి చూడడం తటస్థించినప్పుడే మనస్సు భగవంతునిమీద లగ్నం అవుతుంది. మరి మరలదు కూడా.

---

శబ్దం విన్నవాళ్లకూడా అందెలూ గొలుసులూ పోగటం విన్నామన్నారు. తలా ఒకరూ తలా ఒక మాటా తమకు తోచిందీ, తోచందీ చెప్పారు. ఇంతకూ సారాంశం ఆనాడు అక్కమ్మ సుబ్బారాయుణ్ణి ఆసరాగా తీసుకొని ఒంటిమీద గంపెడు నగలతోటీ, రెండువందల రూపాయల రొక్కంతోటీ లేచిపోయింది. సైకిళ్లన్నీ సాయంత్రానికి వెనక్కి వచ్చాయి, కళ్లూ గాళ్లూ చూచి దుమ్ము తగ్గి దుమ్ము తింటూ. అలా ఆరోజు లేచిపోయింది ఆ అక్కమ్మ ఆ లక్కమ్మ. ఉమ్మక్కమ్మ.

ఇది ప్రకృతిలో దాగిన ఏ పరమ రహస్యమో, సృష్టిలో దాగివున్న ఏ నియతికి భవ్యమో, ఏక కాలంలో మనం తెలుసుకోలేని పాఠమో, మరేమో!

ఆనాడు అక్కమ్మను తిట్టినవాళ్లూ ఈ అక్కమ్మనే ఈనాడు అడ్డు లేకుండా అంతా పొగిడి పొగుడుతున్నారు. కాబట్టి లోకులకు మంచికీ చెడుకూ తారతమ్య జ్ఞానం ఉండదో, లేక నిజాన్ని నిజంగానే పరిగ్రహించి ప్రచారం చేయగల సుగుణశీలతే ఉందో మరి!

* * * * *

చుక్కలాంటి చక్కనిది అక్కమ్మ. తెల్లని తెల్లదనానికి కొంచెం రాగిరంగు చేర్చి మొత్తం కలిపి, చిటికెడు పసుపు కలిపి మాంచి మామిడిపండు రంగుగా చేసి, ఈ సువర్ణచ్ఛాయ పోశాడా శరీరానికి 'బ్రహ్మయ్య'. చక్కని సౌష్ఠవమూ పొందికా కల శరీరం; అంతటా తీర్చి దిద్ది, దివ్యంగా మలిచిన అంగసౌష్ఠవం. వర్ణన మొదలుపెడితే ప్రబంధాన్ని వ్రాయవలసి ఉంటుంది. అంతటి ప్రజ్ఞా పాటవాలు మన కెక్కడివి! తెలివి కూడా ఇచ్చి లేట తెచ్చాడా విగ్రహానికి ఆ ప్రథమ శిల్పి! ఒకే ఒక చిన్న అవస్వరాన్ని మాత్రం ఆభరణంగా ఇచ్చి పంపాడు. కనపడని కోపమూ, విడని పట్టుదలా ఆమె పుట్టుకతోనే పట్టుకుని తెచ్చుకుంది.

ఆ చుక్కమ్మలాంటి అక్కమ్మ వయసు రాకలోనే అందర్నీ ఆకర్షించేది. ముద్దులు మూటగట్టే ఆ చిన్నారిని అంతా పలకరించి, కొంచెం కోపం తెప్పించి 'పో' అని విదల్చగానే ఆ వయారి, నగుమోము మార్చి పెట్టిన బుంగమూతి చూచి మురిసిపోయేవారు. వయస్సు వచ్చినట్లే సిగ్గు వచ్చి చుట్టవేసుకొని అందం అందల మెక్కసాగింది. వరస అయిన వరులంతా ఈ చంద్రకాంత సుమ సౌభాగ్యం తమకే దక్కాలని వాంఛించ సాగారు. సహజమే కదా! చివరికి అక్కమ్మ సూరయ్యను వరించింది. సూరయ్యా చక్కనివాడు. బుద్ధిమంతు డనిపించుకున్నవాడు. ఉన్నంతలో ఆరోజుల్లో చదువుకున్న వాళ్లలో లెక్క గట్టబడ్డవాడు. ఆ రోజుల్లో భాగవతంలో పద్యాలు సూరయ్య చదువుతూంటే చలమయ్య పంతులు అర్థం చెబుతూండేవారు పురాణ కాలక్షేపంలో. దుందుడుకు కృష్ణయ్య దుడుకు చేష్టల్ని యశోదమ్మకు గోపెల్లె పడుచులు చెబుతున్నప్పుడు "ఓ యమ్మ! నీ కుమారుడు మా యిండ్లను పాలు పెరుగు మననీడమ్మా!" అంటూ సూరయ్య పంచమ స్వరంలో కంఠమెత్తి చదువుతూంటే అక్కమ్మలో విచిత్రానుభూతులు ఉద్భవించేవి. పల్లె పడుచులు, యశోదమ్మ, చిన్ని కృష్ణయ్య సూరయ్యలో కనిపించేవారు; తనలో కనిపించేవారు. తన హృదయ తంత్రు లెక్కడ సున్నితంగా మీటబడేవో! తనే సూరయ్యలో ఐక్యమైపోయేది!

సూరయ్య సన్నగా పొడుగ్గా ఉండేవాడు. పుష్టిగల శరీరం కాదు అతనిది. అంతా బక్కవాడని అంటూండేవారు. "వాడెం మొగుడురా దానికి?" అని అక్కమ్మ పెళ్లి రోజున యువక బృందం అంతా వాపోయింది.

అక్కమ్మ సూరయ్యల దాంపత్యం దివ్యంగా సాగింది. సాగుతోన్నే ఉంది. ఓ చక్కని పిల్లకూడా పుట్టింది. పెళ్లి అయిన తరవాత అక్కమ్మలో చలాకీతనం చాలా తగ్గిపోయినట్లనిపించేది. నవ్వినా ఆ నవ్వు వెనక ఏదో విషాదరేఖ సూచిమాత్రంగా కనిపించి మాయమయ్యేది. అప్పుడప్పుడు అక్కమ్మ మా నాన్నమ్మ దగ్గరికి వచ్చి కూర్చుంటూండేది. మా నాన్నమ్మ అవలించకుండానే పేగులు లెక్కపెట్టగల ప్రజ్ఞాశాలిని. ఆమె మాత్రమే పసిగట్టగలిగింది, ఈ మార్పు అక్కమ్మలో. "సంగతేమిటే?" అని కదిల్చిందిట ఓమారు. అక్కమ్మ "ఏముంది, అత్తయ్యా, ఏమీలేదు" అని రెండుమూడు మాట్లు బుకాయించినా నాలుగవ మాటు కళ్లు తుడుచుకొని లేచి పోయిందిట. తరవాత ఎప్పుడో విడమరిచి చెప్పిందిట, "నన్నాయన ఊరికే అనుమానిస్తూ కఠోరమైన మాటలు అంటున్నా"రని. "భార్యా రూపవతీ శత్రుః" అన్న సూత్రార్థం సూరయ్య పట్ల ఒంటబట్టి అతన్ని అనుమానరోగగ్రస్తుణ్ణి చేసింది. "వాడి మొహం! నేను కనుక్కుంటానులే!" అని ఓదార్చి పంపి సూరయ్యను నాలుగు చీవాట్లు వేసిందిట నాన్నమ్మ. తరవాతనే అక్కమ్మ మాతృమూర్తి అయింది. పిల్లకు నాలుగేళ్లు పూర్తి కాకుండానే, ఆ అక్కమ్మే పిల్లను కూడా వదిలి వేసి, ఎగ్గు సిగ్గుల్ని తోసిరాజని లేచిపోయింది. ఈ పరిణామం నాన్నమ్మనే "అక్కమ్మ శీలాన్ని సూరయ్య అన్యాయంగా శంకించలేదా?" అన్న శంకలో పడవేసింది. "అది అలాంటిది కాదు, కాలేదు!" అని ఎంతగా ఆమె ఆత్మ క్షోభిస్తున్నా మనస్సు మాత్రం లేచిపోయిన దాన్ని నిలబెట్టి ముందుకు చూపి "ముంజేతి కంకణానికి అద్దం కావాలా?" అని లోబరుచుకుంది.

* * *

ఎంత దురదృష్టవంతుడో సూరయ్య! బంగారం లాంటి పెళ్లాం లేచిపోయింది. "అయిందేదో అయిపోయిందని మళ్లీ పెళ్లి చేసుకుంటే ఏడాది తిరిగి తిరక్క ముందే ఇది ఓ పిల్లాణ్ణి కని ఇట్లా లేకుండా పోయింది" అని విచారించారంతా. సూరయ్య రెండవ

---

మైకస్ఫి

---


కుట్టుపని నేర్వండి



గురువు లేకుండా అన్నిరకములను స్వయంగా కత్తిరించి కుట్టుటకు 384 పేజీల, 400 బొమ్మల పుస్తకం రు. 8/- బట్ట ఏమీ వృథా పోకుండా కత్తిరించుటకు 352 పేజీల, 2-వేల బొమ్మల 160 ప్లేట్ల పుస్తకం రు. 10/-. 2 తెలుగు. వి.పి. అదనం.
జి. పున్నా రావు చౌదరి, ఆముదాలపల్లె పోస్టు, (వయా) బంటుమిల్లి, బందరు తాలూకా.



సాధ్యంకానిది ఏదీలేదు




ఇందుకు బహుమతి న్యూట్రిన్ స్వీట్లు అయినప్పుడు అది మరింత ఆనందకరం

Nutrine

న్యూట్రిన్ కన్ఫెక్షనరీ కంపెనీ (ప్రైవేట్) లిమిటెడ్
చిత్తూరు. (ఆం. ప్ర.)

EP.NC.7

భార్య అంత్యక్రియలన్నీ అయిపోయాక కూతుర్నీ కొడుకునూ ముందు కూర్చో బెట్టుకొని ఏడ్చాడు— "ఏనాడు ఏం పాపం చేశానో ఈనాడు ఇలా కష్టి కుడుపుతున్నది" అని. బిన్నురాలై నాన్న కళ్లలోకి చూచింది కూతురు. తను మొట్టమొదట అన్యాయంగా అనుమానించి చెవులు చిల్లులు పడేలా అక్కమ్మను దూషించిననాడు ఆవిడ అచ్చంగా అలాగే చూచింది కళ్లలోకి నిస్సహాయంగా. చటుక్కున అక్కమ్మ జ్ఞాపకానికి వచ్చింది సూరయ్యకు. అక్కమ్మను జ్ఞప్తికి తెచ్చుకొంటూనే ఆక్రోశించాడు, పోయిన రెండవ భార్య కోసం కన్న ఎక్కువగా.

* * * *

కృష్ణ పుష్కరాలు వచ్చాయి. పాప పంకిలాన్ని ఆ కృష్ణమ్మతల్లి పునీత జలంతో పోగొట్టుకోవటానికనీ, పూర్వులకు సద్గతులు కలిగించే సదుద్దేశ్యంతో తర్పణలు ఇచ్చి తరింపజెయ్యటానికనీ, జన సందోహాన్ని సరదాగా చూడటానికనీ వేలకు వేలు ప్రజలు వచ్చారు. కృష్ణకు బాగా దిగువన స్నానంచేసి సూరయ్య, తండ్రి తాత లకూ తల్లి ముత్తవలకూ రెండవ భార్యకూ తర్పణ లిచ్చాడు. పొడి బట్టలు కట్టుకొని పైకి వచ్చాడు. స్నానం చేసిన తడి బట్టలతోనే అతన్ని వెంటాడిన స్త్రీ తలవంచుకొని నమస్కారం చేసింది. ఏ ఓచ్చ గత్తో అని తల పైకెత్తి చూచిన సూరయ్య చకితుడై, చలించి నిర్ఘాంతపోయాడు! అక్కమ్మ, తనను వదిలి పోయిన మొదటి భార్య! ఆమెను చూడగానే సూరయ్య మనస్సులో ఉదయించిన భావమేమో చెప్పటం కష్టం. బహుశా నాళ్ళ్లా సరాలూ పనిచేయటమే మానివేశా యేమో! అక్కమ్మ నిశ్శబ్దంగా నిశ్చలంగా నిలుచుంది. వాళ్లిద్దరి చూపులూ కలిసేసరికి ఆ నాలుగు కళ్ళనూ నీరే ముంచివేసింది. అంతలో నాళ్లన్నీ చైతన్యవంత లయ్యాయి. సూరయ్య మెదడు పని చేసింది. ఆపుకు న్నాడు. అక్కమ్మ కళ్ళు మూసుకుంది. బద్దలై పోలేని హృదయాన్ని బిగబట్టుకుంది. కాస్సేపటికి ఎవరిని వారే ఓదార్చుకున్నారు. ఏమి మాట్లాడాలో ఎవరికీ బోధపడలేదు. ఆఖరికి అక్కమ్మే మాట్లాడింది, "అమ్మాయి బాగుందా?" అని.

# నివేదిత

"అమ్మాయీ, అబ్బాయీ కూడా బాగున్నారు. నేనే అన్యాయమై పోయా" నని అంగలార్చిన సూరయ్య మాటలు అర్థంకాక చూస్తున్న అక్కమ్మ అతని రెండవ భార్య పోయిందని విని కరిగి నీరై పోయింది. నోటికి గుడ్డ అడ్డం పెట్టుకొని ఆక్రోశించింది.

వాళ్ల ఊరివాళ్లు ఎవరో రావడం చూసిన సూరయ్య, "వాళ్లు వస్తున్నా" రని అక్కమ్మతో అని ఏ పరస్త్రీతోనో ఏకాంతంగా మాట్లాడటాన్ని చూచినవారు ఏమైనా తప్పుగా భావిస్తారేమోనని భయ పడ్డట్లుగా బయలుదేరాడు, "పుష్కరాలు వెళ్లిందాకా ఉంటారు గదూ?" అన్న అక్కమ్మకు ఔనన్నట్లు తల ఊపి. మళ్లీ సచేల స్నానాన్ని తలారా చేసి ఇంటికి వెళ్లింది అక్కమ్మ.

మరునాడు అదే వేళకు అక్కడికే వచ్చిన అక్కమ్మ సూరయ్యకు తను లేచివచ్చిననాడు తీసుకొని వచ్చిన నగలన్నీ, రెండువందల రూపాయలతో సహా మూట కట్టి తెచ్చి ఇచ్చింది.

"పోకూడనివన్నీ నన్ను వదిలి పోయాక ఇవి వచ్చి మాత్రం నన్నేం ఉద్ధరిస్తాయి? నీవే ఉంచుకో!" అన్నాడు సూరయ్య.

"ఇవ్వి ఉండీ నన్ను ఉద్ధరించలేకపోయాయి. మీవి మీరు తీసుకువెళ్లండి. అలా తీసుకొని వెళ్లటానికి ఇష్టం లేకపోతే, ఎంత పతితురాలికైనా సంతానం మీద మమత పోదు కనుక, అమ్మాయికి ఇవ్వండి, నావని చెప్పకుండా!" అంటూ కళ్లవెంట కన్నీరు విడిచింది అక్కమ్మ.

"ఇప్పుడు జరుగుబాటు?" ఏమి సమాధానం వినవలసివస్తుందో అని భయపడుతూనే అడిగాడు సూరయ్య.

"దేవుడి దయవల్ల లోటు లేకుండానే ఉంది. రెండు పాడి గేదెల్ని, ఒక ఆవుని కొనుక్కున్నాను. వాటి పైననే జీవనం."

తరవాత ప్రశ్న వేయలేకపోయినా సూరయ్య ముఖంలోని సందేహాన్ని పసిగట్టిన అక్కమ్మ తనే ప్రశ్న వేసుకొని సమాధానం చెప్పింది గంభీరంగా ముఖంపెట్టి.

"తోడు ఎవరనేనా? హుఁ! భగవంతుడు ఒకతోడు ఇచ్చాడు."

సూరయ్య మెదడు స్థానం తప్పింది. స్వస్థానానికది ప్రస్థానం నుండి వచ్చేసరికి అక్కమ్మ ఆ మూట అక్కడ ఉంచటం, చటుక్కున దణ్ణం పెట్టటం, గిరుక్కున వెనక్కు తిరగటం, గబుక్కున వెళ్లిపోవటం — అన్నీ క్షణమాత్రంలో జరిగిపోయాయి!

* * * *

సూరయ్య కృష్ణ పుష్కరాల్లో అక్కమ్మను కలుసుకొన్న రాత్రి ఆమెను గురించి చాలాసేపు ఆలోచించాడు. వస్తుతః అక్కమ్మలో ఉన్న పట్టుదలా, కోపమూ అతను ఎరుగనివి కావు. నిజానికి అక్కమ్మను అతడు రంకుపుకోత కోసిన మాట అక్షరాలా నిజం; ఆ సంగతి అతని అంతరాత్మ జ్ఞాపకం చేస్తూనే ఉంది. అక్కమ్మను లేచిపోయేటంత స్థితికి తీసికొనిరావటానికి అతనే కారణమని ఎన్నిమార్లో అతని అంతరాత్మ చెప్పటానికి ప్రయత్నించినా అతని మనస్సు తనుగా ఆ మాట ఒప్పుకోవటానికి అంగీకరించటం లేదు. ఈ రాత్రి అహంకారాన్ని తోసిరాజని ఆలోచిస్తున్నప్పుడు మన శ్శక్తి, అంతరాత్మ శక్తికి లొంగిపోయింది. తనే కారణం కావచ్చు నన్నంతవరకు అది ఒప్పుకుంది. కాని, అంతలోనే మరో విశేష ప్రజ్ఞ ప్రదర్శించిన మనస్సు, "అలాగే అనుకుందాము. భారత స్త్రీ భర్త పెట్టిన వ్యథ మనసారా భక్తిపూర్వకంగా అంగీకరించి స్వీక రించాలే కాని, ఇలా లేచిపోవటం తప్పు కాదేం?" అని నిగ్గదీసింది. నైతికమయిన విలువలు తలకిందై పోయిన కాలగతిలో భ్రమిస్తున్న లోకంలో తప్పొప్పుల తారతమ్యానికి హద్దులూ అవధులూ మారిపోతాయన్న నిజాన్ని ఇచ్ఛితంగా ఒప్పుకోని సూరయ్యకు తన దోషిత్వం నిర్ధారణగా తెలిపోయింది. ఇందువల్ల మరో ఉపకారాన్ని కూడా గ్రహించాడు సూరయ్య. తప్పు చేసింది నిజానికి తను; కాని, దుష్ఫలితాన్ని అనుభ వించింది అక్కమ్మ. దూషణే గాకుండా దౌర్భాగ్యపు జీవితాన్ని అనుభవిస్తున్నది. కన్న సంతానానికి దూరం అయింది. ఇంతకన్న ఏ తల్లికి మాత్రం పెద్ద శిక్ష ఏముంటుంది?

తను మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. హాయిగా కాలం గడిపాడు. అందరి సానుభూతీ తనపట్లనే ఉంది. భగవంతుడు చిన్న చూపు చూశాడు కాబట్టి తన భార్య పోయింది గాని లేకపోతే సూరయ్య బాధపడవలసిన కారణ మేముంది?

ఏ పురాణ సంప్రదాయాన్ని అనుసరించి తను మంచి చెడూ ఆలోచిస్తున్నాడో, ఆ సంప్రదాయాన్ని అనుసరించే, పశ్చాత్తాపం మానవుణ్ణి, బంగారాన్ని పుటం పెట్టి శుద్ధి చేసినట్లు పునీతుణ్ణి చేస్తుందన్న సూక్తి ననుసరించే పశ్చాత్తప్తురాలుగా కనిపిస్తున్న అక్కమ్మను తానే క్షమించి తీసుకొనివెళితే? అనిపించింది. ఆ విష యాన్ని మరునాడు అక్కమ్మతో సంప్రతిద్దామని అనుకున్నాడు. కాని. అంతలోనే, 'అక్కమ్మ ఎలా ఉంటూందో, ఎలా జీవితాన్ని గడుపుతూందో?' అన్న సంశయం ఏదో చూచాయగా తోచింది. తానుఅక్కమ్మను గురించి ఇంత వరకూ చెడుగా ఏమీ వినలేదు.

## కయ్యం ఒక వినోదం

కత్తిరింపు చిత్రం—కోరా సీతామహాలక్ష్మి (క్రోసూరు)



ఆ మరునాడు కలుసుకున్నప్పుడు "నచ్చినాతో ఉంటావా?' అని అడుగుదామనుకున్నాడు. కాని ఏ అజ్ఞాత శక్తో అశక్తుణ్ణి చేసింది; ఏ దుష్ట శక్తో అనుమానిస్తున్నట్టు తనను రూపొందించింది. అనుకోని విధంగా ఆకాంక్షించని విధంగా అవాడు అలా గడిచి పోయింది.

అక్కమ్మ సూరయ్యను కలుసుకున్ననాటి రాత్రి ఒంటరిగా కూర్చుని ఆలోచించింది. తను సూరయ్యకు అన్యాయం చేశానన్న మాట అక్కమ్మ మనస్సు ఎప్పుడో అంగీకరించిన విషయం. తనను అన్యాయంగా అనుమానించి బాధ పెడుతున్నాడన్న కోపం కొద్దీ అతని కేదో గుణపాఠం నేర్పుతున్నానన్న భ్రమతో అక్కమ్మ అతనికన్న చాలా చిన్నవాడూ అర్భకుడూ అయిన సుబ్బా రాయుణ్ణి ఏవేవో పిచ్చి ఆశలు చూపి తోడుగా తీసుకొని పోయింది. సుబ్బారాయుడికీ తనకూ ఎలాంటి శారీరక సంబంధమూ లేదని తమ ఇద్దరికీ తెలుసు. మొదట్లో అక్కమ్మ భావించినది ఒకటి; జరిగినది వేరొకటి. అన్ని నగలూ తీసుకొని, పిల్లను కూడా వదిలి వెళ్లిన తనను వెంటనే వెతికి తీసుకుపోతారనుకుంది. కాని, తననే వాళ్ళు వదిలి వెయ్యరని అనుకుంది. ఆ బంగారం తనను తప్పక ఉద్ధరిస్తుందని అనుకుంది. అందువల్లనే తన నగకట్టు అంతా కట్ట కట్టుకొని తీసుకు వెళ్లింది. పోవటం పోవటం బెజవాడలో తన పినతల్లి దగ్గిరికి చేరింది. సుబ్బారాయుణ్ణి గుంటూరులోనే పది రూపాయలు ఇచ్చి వదుల్చుకొంది. పది రోజులు రోజూ రోజూ ఎదురుచూచింది ఎవరైనా వస్తారేమో అని. తరవాత స్వయంగా తాను అక్కడికి చేరినట్లు తెలుపును చేయించింది కూడా, తాను కానట్లు. అప్పటికీ వాళ్లు ఎవరూ రాకపోయేసరికి భయపడ్డది; బాధపడ్డది; చాటుమాటుగా ఏడ్చింది. ఏడాది గడు స్తున్నా సూరయ్యా వాళ్ల ఇంటి మాలకాక అయినా బెజవాడ రాలేదు. కనీసం తల్లి అయినా వస్తుందను కుంది. ఆమె కూడా వేలు విడిచిన తమ్ముడితోనే ఏకీ భవించి తనను వెలివేసిం దనిపించి ఆక్రోశించింది. ఏమైనాసరే తాను మళ్లీ తిరిగి వెళదామనుకుంది. తనుగా వెళ్లితే తన్ని తగిలేస్తారేమోనని భయ పడ్డది. తన గ్రామంలో తను వెళ్లిపోయిన తరవాత వచ్చిన నిందకు తెల్లబోయింది. ఇప్పుడు అక్కడికి ఏ ముఖం పెట్టుకు పోవాలో తోచక పోలేకపోయింది. కూతురు జ్ఞాపకానికి వచ్చినప్పుడల్లా కడుపు కోత కోసేది. పినతల్లి కూతురుకు చెప్పుకొని బాధ వెళ్ల బోసుకుని, ఉపశమింప చేసుకుందామని పోయి చెప్పు కుంది. అది ఏ మాత్రమూ లెక్కలేని జాణ! "పోతే పోయాడులెద్దూ. వాడే మగాడా? పిల్ల తప్పిపోతే ఒక ఏడుపు ఏడ్చి ఊరుకోవూ?" అంది అంతా విని. ఈ కాలపు పోట్లకు ఎంత దుఃఖించిందో ఆరోజు. 'తిరా తను వచ్చి ఈ దౌర్భాగ్యురాలి పంచకు చేరానేమో?' అని బాధ పడ్డది. మథనపడ్డ కొద్దీ అక్కమ్మకు ఆలోచనలు రావటమే మానివేశాయి. ఓ మూల చోటు దూచు కొని కాచుకుని కూచున్న అహం పైకి వచ్చింది దొడ్డి దోవన—"ఇంతగా బెంబేలుపడి ఏడవకపోతే బతకలేవా? వాడికి అవసరం లేకపోతే చూరుపట్టుకు వేళ్లాడతావా?" అంటూ.



మత్స్యనేత్ర

చిత్రం—కొలను వెంకటదుర్గాప్రసాద్ (విజయవాడ—4)

అక్కమ్మ పినతల్లి కూతురు అప్పుడప్పుడు ఎదురింట్లో ఉంటున్న ఎర్ర అబ్బాయిని గురించి పొగుడు తూండేది. చాలా మంచివాడనేది. అయినా ఎప్పుడూ తలెత్తి చూచినట్లు కనిపించేవాడుకాదు. నిజమే, మంచి వాడనిపించింది. ఎప్పుడో ఒకమారు కాకతాళీ యంగా అక్కమ్మ చూపులూ అతని చూపులూ కలి శాయి. అతని సుందర ముఖారవిందంలో ఓ చిరు నవ్వు తళుక్కున మెరిసి దాక్కుంది. అక్కమ్మ మనస్సు కలుక్కుమంది. మళ్లీ నవ్వితే బాగుండుననిపించింది. ఆ మందహాసంలోని మాధుర్యం, దాని జంటతోపాటు తెలియకుండానే తెరిచిరాజని అక్కమ్మను ఆకట్టింది. అక్కమ్మ మతి మంత్రిని అడ్డం వెయ్యలేనంత మంద మైంది. ఆ దరహాసం కోసం అతను మెదిలినప్పుడల్లా విస్మయంగా చూడసాగింది.

ఓనాడా చిరునవ్వు చమత్కరించింది. అక్కమ్మ చలించిపోయింది. అక్కమ్మ లోలోపల మనస్సులో అణగారి ఉన్న రెండు అంతశ్శక్తుల మధ్య సంఘర్షణ రేగింది; చెలరేగింది. తరతరాల వారసత్వాన భారతజాతికి చెందిన నీతినియమాల నిధి, "అవసరానికి లేనిది అడుక్కు తినడా? నన్ను ఉపయోగించుకో" అంది. వెంటనే అక్కమ్మ సూరయ్య దగ్గిరికి వెళ్లిపోవాలని నిశ్చ యించుకొంది. ఆ బెజవాడలోనే ఉన్న దూరపు బంధువు ఒకాయన దగ్గిరికి వెళ్లి తన గోడు చెప్పుకొంది. తన శరీరం మైలపడలేదనీ, తప్పు తెలుసుకున్నాననీ, తనను తీసుకొని భర్త దగ్గిర వదిలివెయ్యమనీ ప్రాధేయ పడింది. ఆ బంధువూ జాలి పడ్డాడు. "మొదటనే నిన్ను వెంటబెట్టుకుపోతే ఎట్లా ఉంటుందోనమ్మా! ఓసారి వెళ్లి సంగతి, సందర్భమూ మాట్లాడివస్తా" నని చెప్పి వెళ్లాడు. మూడవరోజు తిరిగివచ్చాడు.

సూరయ్య సుతరామూ అంగీకరించలేదనీ, మరో వివాహ ప్రయత్నాలు జరుగుతున్నాయనీ చెప్పాడు. అధః పాతాళలోకానికి పడిపోతున్నట్లనిపించింది. అక్కమ్మ కళ్లు బైర్లు కమ్మాయి. ఎక్కడో అంటి పెట్టుకొని ఉన్న ఆశాజ్యోతి ఆరిపోయి బతుకు అంధ కారం అయింది. ఏ నిశిత జలపాతంలోనో పడి శరీరం అంతా ముక్కలు తిరిగిపోయినట్లయింది.

ఇంటికి వస్తున్న అక్కమ్మకు సుందరమూర్తి ఎదురైనాడు. అక్కమ్మ ఆ మందహాసం కోసం నిర్లిప్తంగా, విస్మయంగా అటుచూచింది. ఆమందహాసంతో పాటు అతని కళ్లూ నవ్వాయి. అక్కమ్మ అడుగుల్లో అడుగు వేసుకుంటూ ఇంటికి చేరింది. ప్రతి అడుగునా అక్కమ్మ తన భవిష్యత్తు ఏమిటో తెలుసుకోవాలని వ్యర్థ ప్రయత్నమే చేసింది. పుట్టుకతో అక్కమ్మ తెచ్చుకున్న చిరుకోపమూ, పట్టుదలా పైకి వచ్చాయి. ఆమె దుఃఖం అంతా కరిగి కోపంగా జాలువారింది. బాధ అంతా మారి పట్టుదలగా ఘనీభవించింది. జరిగింది జరిగిపోయింది. వేసిన అడుగు తప్పో ఒప్పో తెలియక వేసినా తమాయించుకోవటానికి వీల్లేకుండా తప్పు అయి కూర్చుంది. క్షమాగుణం లేక నిర్దాక్షిణ్యంగా తనను అంత క్రూరంగా శిక్షించ సంకల్పించు కొన్న సూరయ్య సుఖపడుతున్నప్పుడు, తనెందుకు సుఖపడరాదనుకుంది. ఎందుకు సుఖపడలేననుకుంది. తన సుందర విగ్రహం తన కాశ్రయమిచ్చింది; అంగ సౌష్ఠవం ఆదరణ ఇచ్చింది; ధైర్యం చెప్పింది; నేనున్నా నని భరవసా ఇచ్చింది.

ఆవిడ అంతస్సులో సుందరమూర్తి సుందరాకృతి రేఖ తటిల్లతలా తళుక్కుమంది. అక్కమ్మ అధరాలు నవ్వాయి; కపోలాలు కదలాడాయి; ముకుళిత నేత్రాలు విప్పారి, వికసించి సజీవాలై మెరిసిపోయాయి.

ఇంటికి చేరిన అక్కమ్మ గంభీరంగా తల్లి స్నానం చేసింది. తీరికగా తల దువ్వింది. ఎప్పుడూ ఎరగని పినతల్లి కూతురు ఉపయోగించే పరిమళ తైలాన్ని అడిగి తీసుకొని ఉపయోగించింది. కాటుక దిద్దింది;

ఫోన్ 243
No 638
శారదా (REGD) ఆభరణములు
బంగారు కవరింగ్ చేయబడినవి
5 సం॥ గ్యారంటీ
No 788
శారదా గోల్డ్ కవరింగ్ వర్క్స్
చిలకలపూడి P.O. మచిలీపట్నం 2

గజ్జి దురద

మీ చర్మములోగల కోట్లకొలది సూక్ష్మరంధ్రము లలో అనేక విధములగు క్రిమి జాలములు దాగి యుండి చర్మమునకు దురద, పగుళ్ళు, కలిగిం చుటయేకాక గజ్జి, చర్మము రాలుట, చర్మము మంట, చీడ, తామర, పొడ, మొటిమలు, పాదము లలో దురద, తదితర లక్షణములను పుట్టించును. సాధారణ చికిత్సల ద్వారా క్రిములు నశించకుండు టచే తాత్కాలిక ఉపశాంతి మాత్రమే కలుగును. శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM)తో వెంటనే క్రిములు నశించుట యేగాక మీ చర్మము మృదువుగాను, శుభ్రముగాను ఉండుటకు యీ మందు తోడ్పడగలదు. చర్మ వ్యాధులకు కారకమైన క్రిములను నిశ్చయముగా సంహరించు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

ఇప్పుడే వెలువడింది

ఔషధకాండ (మొదటిభాగం) రు. 6-00
డా॥ గాలి బాలసుందరరావు గారి రచన
వారి ఇతర రచనలు :

| | |
|---|---|
| శరీర ధర్మకాండ | రు. 10-00 |
| రోగకాండ | రు. 5-00 |
| సత్యాగ్రహి (సాంఘిక నాటకం) | రు. 2-00 |

మొదటి మూడు పుస్తకాలు ఒకేసారి కొను వారికి రు. 20/- కే లభించును. పోస్టేజి ఉచితము. ఆర్డరుచేసేవారు రు. 5/- M.O. చేయవలెను.

మధురా పబ్లికేషన్స్,
88. సర్ త్యాగరాయ రోడ్,
మద్రాసు-17.

# నివేదిత

తిలకాన్ని తీర్చింది; పెండ్లినాటి పెద్దచీర సింగా రించింది; ఒద్దికగా అద్దం ముందు నిల్చుని వెనుక ముందులకు చూచుకుంది; కురులను బుజ్జగించింది; చీర చెరగుల్ని చేరదీసింది; కుచ్చెళ్లను కూడదీసింది; మెడ పైకెత్తి మెత్తగా నవ్వింది. "మీరజాల గలడా? నా యానతి?" అన్న ఆనాటి సత్యలోని దర్పాన్ని దర్పణానికి చూపింది.

ఇట్నే గ్రహించిన పినతల్లి కూతురు "అక్కా, నేను సినిమాకి వెళుతున్నా" నని వెళ్లిపోయింది. ఇప్పు డింటికి అంతా అక్కమ్మే! వాకిట్లో నిలబడి సుందరమూర్తి కోసం చూచింది అక్కమ్మ. ఆ గది తాళం వేసి ఉంది. మరో గంటలో అతను వస్తాడనుకొని లోపలికి వెళ్లి మంచం వాల్చి కూర్చుంది అక్కమ్మ. అక్కన్ను అక్క మ్మను ఆరాటపెట్టసాగింది. తను సుందరమూర్తితో స్నేహం చెయ్యాలి. సూరయ్యకన్న ముందే, అతడు నిరాకరించిన తన లోటు లేకుండా శరీర సౌఖ్యాన్ని అనుభవించి కసి తీర్చుకోవాలి. ఆ క్షణం ఆలస్యం కాకూడదని వేగిరపడ్డది. క్షణక్షణానికి ఎదురింటి వైపు చూచింది. ఉసూరుమని నిట్టూర్చింది. మళ్లీ వచ్చి కూర్చొని సుందరమూర్తితో తన స్నేహలత ఎలా సాగి సాగి చిలవలు పలవలుగా తేలి మొగ్గలు వేసి పూత పుయ్యాలో మధురంగా ఊహించసాగింది.

సుందరమూర్తి కౌగిలిలో తనను తాను మరిచి పోవటానికి ప్రయత్నిస్తోంది. కాని, ఆ అనుభూతికన్న సూరయ్య మీద సాధిస్తున్న పగ మాత్రమే అనుభూతు లకు అందుతూంది. సూరయ్య జ్ఞాపకానికి వస్తున్నప్పు డల్లా కసిదీరా సుందరమూర్తిని కౌగిలించుకొని, హత్తుకొంది; కొంతసేపటికి కసి తీర్చుకున్న తృప్తిని సాధించింది. ఊహ మారింది.

తాను గర్భవతి అయింది. సుందరమూర్తి చిన్న చూపు చూచాడు. పినతల్లి కూతురు మాత్రలేవో తెచ్చి మింగమంది. తనలోని మాతృమూర్తి ఛీత్కరించింది. పినతల్లి కూతురు పెద్దదానినంది. మాత్రలు మింగక తప్పలేదు. కడుపులో దారుణమైన బాధ చెలరేగింది. దుర్భర వేదన ప్రసవవేదనకన్న భరించరానిదైంది. పోలేక పోలేక ఆ గర్భం పోయింది. తనకు తెలివి వచ్చే సరికి హాస్పిటల్‌లో ఓ మంచం మీద ఉంది. బతికావు పొమ్మని పంపారు. నీరసంగా ఇంటికి చేరింది. సుందర మూర్తి చూచిఅయినా పోలేదు. పినతల్లి కూతురు చిన్నచూపు చూచింది. అక్కమ్మ హృదయం బద్దలై పోసాగింది. స్త్రీ జీవితంలోని జారుడుబండల ప్రభావం అప్పుడు అర్థం కాసాగింది. బెదిరిపోయిన అక్కమ్మ లోని అబల "అమ్మయ్యో!" అని అరిచింది. ఊహలు పారిపోయాయా కేకకు. అక్కమ్మ అక్కమ్మ అయింది. ఎదురుగా శ్రీరామచంద్రమూర్తి పట్టాభిరాముడై సీతా సమేతుడై ఉన్న పటం కనిపించింది. ఆ పటాన్ని చూచి దొంగలా భయపడి, చేతులతో ముఖాన్ని మూసు కుంది. అంతలో తెలివిఅంది చేతులెత్తి నమస్కరించింది. ఆక్రోశించింది. అటు చూచింది. అద్దంలో తన పాప న్నలేదు. తనను తానా అద్దంలో చూడలేకపోయింది. గబ్బున లేచి లోపలికి వెళ్లింది. చీర మార్చింది. నగలు తీసివేసింది. వచ్చి రామచంద్రమూర్తి పటానికి ఎదురుగా కూర్చుంది. అక్కమ్మ మనస్సు ఇంకా కనిపించని వ్యథ పడుతూనే ఉంది. ఆలోచనలు మాత్రం రావటం లేదు. యాంత్రికంగా వాకిటికి ఎదురుగా ఉన్న గోడవైపు చూచింది. బుద్ధి పనిచేసి "చూచావా?" అంది. ఎదురు గోడ తను వచ్చినప్పుడు శుభ్రంగా ఉండేది. ఎప్పుడో ఎందుకో ఒకే ఒక్క రాయి మధ్యలో జారింది. ఇప్పు డన్నీ ఇటుకలు లే వక్కడ. ఆ గోడ జీర్ణమైపోతూంది. మరికొన్నాళ్లు అలాగే గడిస్తే మదురు జారి పడిపోతుంది, నామరూపాలు లేకుండా అక్కమ్మకు ఆలోచనలు వెల్లువలై రాసాగాయి. ఆ గోడ, ఇటుకల గోడ మానవ జీవితమై లే? ఆ రాళ్ళ ప్రవర్తనలయిన అలంబనా అన్నమాట. జారిన ఓ ఇటుకను వెంటనే సరిదిద్దకపోతే ఆధారాలు సడలి జీవితమే జీర్ణమై పోతుందన్నమాట! జీర్ణ కుడ్యమూ మానవునికి సత్యాన్ని ప్రబోధించే పరికరంగా భగవంతుడు అమర్చి, అతడు జారిపోకుండా ఉండటానికి కావలసిన సకల సదుపాయాలు సమకూర్చి ఉపయోగించుకోండి అని ప్రసాదించాడన్నమాట! చకితురాలయింది అక్కమ్మ. ఇక తనేం చెయ్యాలి? చాలావరకు శిథిలమైన కుడ్యాన్ని అండలు వేసి సరిచేస్తే చాలుతుందా? అంతకన్న పూర్తిగా తీసివేసి తిరిగి కట్టటం మంచిదని. మరి తన జీవితాన్ని? అక్కమ్మకు ఒక్కటే ఆలోచన వచ్చింది, ఈ జీవితాన్ని అంతం చెయ్యటమే మంచిదని. అంతే. 'కృష్ణమ్మ తల్లి ఇలాంటి అభాగ్యుల కెంతమందికో చోటు ఇచ్చి చేరదీస్తుంది' అని నిర్ణయించుకొంది అక్కమ్మ.

చక్కని శత్రుత్వంలోనూ మిత్రత్వం అణగారి ఉంటుంది, మహా విషం ప్రాణాన్ని రక్షించగల శక్తి వంతమూ అయినట్టు! అక్కమ్మ పుట్టుకతోనే పట్టుకువచ్చిన చిరుకోపమూ, పట్టుదలా పైకి వచ్చాయి. కోపం కోపగించుకొంది, 'చచ్చి ఏం సాధిస్తా' వని. పట్టుదల పళ్ళు కొరికింది—"జీవితాన్ని భ్రష్టం చేసుకొమ్మని ఎవరన్నారు? ధన్యం చేసుకొనే సాధించు. సుఖమన్నదీ కష్టమన్నదీ కేవలం మానసిక ప్రవృత్తులే. సూరయ్యను నీవు భ్రష్టునై పాధించేకన్న ధైర్యంగా దివ్యజీవనం గడిపితేనే ఎక్కువ సాధిస్తావు. చావటం చేతకాని పని" అంటూ.

నిజమే. బ్రతికి పరిహారాన్ని చూచుకోవాలి కాని, చచ్చి సాధించేది ఏముందనిపించింది. ఆ రోజుతో అక్కమ్మ జీవిత గతే మారిపోయింది. మధ్యలో లేచి వచ్చిననాటి అక్కమ్మ చచ్చిపోయింది. అసలు అక్కమ్మ మాత్రం నిలిచిపోయింది.

తన దగ్గర ఉన్న డబ్బుతో అక్కమ్మ ఒక గేదెనూ, ఒక ఆవునూ కొంది. పినతల్లి ఇంటి పరిసరాలనే వదిలి ఒంటరిగా సత్యనారాయణ గుడికి దగ్గర్లో ఓ పూరి ఇల్లు తీసుకొని కాపరం పెట్టింది. పాలు అమ్ము కుంటూ జీవితయాత్ర సాగిస్తోంది. ఆవుపాలు పసిపిల్లలకు ఉచితంగా ఇస్తూండేది. శివాలయంలో అభిషేకానికి, దైవమూర్తుల్లాంటి పసిపిల్లలకు మాత్రమే ఉపయోగింపబడ్డది ఆ పంచామృతాల్లో ప్రథమామృతం.

గాంధీనగరంలోని సత్యనారాయణమూర్తి ఆల యాన్ని తెల్లవారకుండా చిమ్మి, నీళ్ళు చిలకరించి

ఠంత్రభపరిచి, స్నానం చేసి గోమాతను పూజించి పాలు పితికి, ఎవరి పాలు వారి కందించటం అక్కమ్మ ప్రాతః కాల దినచర్యగా మారింది.

రథసప్తమినాటి పొద్దున పాలు పొంగించుకునేందుకు ఆవుపాలు దొరక్క, జయలక్ష్మమ్మగారు ఆ వూరింట్లో ఉంటున్న ఆవిడ ఆవుపాలు ఇస్తుందని విని పాలకని వెళ్ళింది. వాకిట్లో దూరంగా నించుని "ఆవుపా లేమన్నా దొరుకుతాయా, అమ్మా?" అంది. ఇంకా పూర్తిగా తెల్లవారనేలేదు. అక్కమ్మ అప్పటికే "సప్త సప్త మహా సప్త, సప్తద్వీపా వసుంధరా . . . . సప్తమీ, రథ సప్తమీ" అని కృష్ణానదిలో స్నానం చేసి వచ్చింది. గోపూజ చేసుకొని పాలు పితకటానికని తోడు బాలికతో బయటికి వస్తోంది. నిండు ముత్తయిదువ జయలక్ష్మమ్మగారు వాకిట్లో కనిపిస్తే అక్కమ్మకు లక్ష్మీదేవి స్వయంగా సహస్ర కళలతో విరాజిల్లుతూ ప్రత్యక్షమైనట్లు అనిపించింది. గోలక్ష్మిని పూజించటానికి బయలుదేరిన అక్కమ్మ స్వయంలక్ష్మిని చూచి, "తల్లీ, లోపలికి రండి!" అంది. ఆవరణలోనికి వచ్చిన ఆ స్వయంలక్ష్మికి చెంబులో నీళ్ళతో కాళ్ళు కడిగి, పళ్ళెంలోని పసుపు రాసి, "లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం" అంటూ నమస్కరించింది.

ముఖాన బొట్టు పెడుతూండగా జయలక్ష్మమ్మ చూచింది అక్కమ్మను. అక్కమ్మేనా? అనుకుంది. అంతలో అక్కమ్మ ఇంట్లో నుంచి ఓ ముక్కాలిపీట తెచ్చి వేసి, "కూర్చోండమ్మా! పాలు పితికి తెస్తా" నని గోలక్ష్మికి పూజచేసి పాలు పితికి తెచ్చింది. పాలు పొయ్యబోతూ తెల్లని వెలుగులో జయలక్ష్మమ్మను పోల్చుకొంది. "జయమ్మ తల్లీ! మీరా?" అంది. మళ్ళీ చేతులెత్తి నమస్కారం చేసింది. కళ్ళనీళ్ళు అద్దుకుంది.

జయలక్ష్మమ్మ తన ఊళ్ళో సదాచార సంపన్నులూ, నిత్యనైమిత్తిక కర్మిష్ఠులూ, విద్వాంసులూ, విద్యాదాన శీలురూ అయిన చలమయ్య పంతులుగారి తనూజ. మహా విద్వాంసురాలు, దైవభక్తి పరాయణ. పురాణ కాలంనాటి పతివ్రతలకోవకు చెందిన మహావ్యక్తి. అక్కమ్మను చిన్ననాటినుంచీ ఎరిగిన మనిషి.

ఆనాటినుండి అక్కమ్మకు జయలక్ష్మమ్మగారి అండ దొరికింది. ఆమె నీడన అక్కమ్మ తన కష్టగాథ అంతా మరిచిపోయి, మానవ జీవితాన్ని ధన్యం చేసికొని తరింపజేసే భక్తి మార్గంలో కాలం అంతా వినియోగిస్తూ ధన్య జీవితాన్ని గడపసాగింది.

సూరయ్య భార్యా వియోగంతో బాధ పడుతున్నాడని విని తను పోయి పరిచర్య చేసి తరిద్దామనుకొంది. క్షమాపణ చెప్పుకొని రావటానికి అనుజ్ఞ అడుగుదామనుకున్న అక్కమ్మకు సూరయ్య మాటల్లోని సంశయ సందేహాలు ఆమెలోని ఏ దుష్ట నరాన్నో తాకి జుగుప్స కలిగించాయి. తానేది ఆకాంక్షించలేదో అదే జరిగిపోయిం దానాడు. తను సూరయ్యను ఆనాడు రెండవ మారుగా, తన ఇష్టానికి వ్యతిరేకంగా వదులుకుంది. ఆ సత్యనారాయణమూర్తే గతి అని భావించి తల ముక్కలుగా దుఃఖించి ఆ గుడి గోడలకు తన వ్యథ అంతా విన్నవించుకొంది ప్రదక్షిణాలు చేస్తూ.

* * * *

"అక్కమ్మ వచ్చిందట! అక్కమ్మ వచ్చిందట."

అంటూ ఊళ్ళో వాళ్ళంతా తీర్థ ప్రజల్లా రాసాగారు సూరయ్యఇంటికి. ఆ పేరుతో రావటం పెద్దమనిషి లక్షణం కాదనుకొన్న పెద్దలు సూరయ్యను చూడాలనే మిషతో వచ్చారు. సూరయ్య పక్షవాతం వచ్చి కాలూ, చేయీ పోవటంవల్ల మంచంలో పడిపోయాడు. మొదటి మాటు పక్షవాతపు లక్షణాలు కనిపించగానే సూరయ్య తన జీవిత సమాప్తి కనుచూపుమేరలో ఉందని గ్రహించాడు. స్వయంగా సూరయ్య పంపిన కబురు వినే అక్కమ్మ ఆ ఊరు వచ్చింది.

అక్కమ్మను చూడడానికి అంతా వచ్చారు; ఇక రానిదల్లా అక్కమ్మ కూతురూ, అల్లుడూ మాత్రమే! ఆ ఊరిలోనే అవతలి వీధిలో ఉంటున్నా కన్న కూతురు వచ్చిన పాపానపోలేదు. కూతుర్ని చూడలేకపోయినందుకు అక్కమ్మ పేగులు పీకుతూనే ఉన్నాయి. 'లేచిపోయినదని తన్ను చూడటానికి ఇష్టపడలేదేమో కూతురు' అనుకొని సిగ్గుపడిపోయింది అక్కమ్మ; నిట్టూర్చింది. రామచంద్రా! అనుకుంది. సూరయ్య పరిచర్యతో సతమతమవుతున్న అక్కమ్మకు ఈ విషయాన్ని ఇంతగా విచారించటానికి అవకాశమే చిక్కలేదు. 'తీరా పదిరోజులైనా, తండ్రినైనా చూడటానికి రాలేదేమా?' అని విస్తుపోయి విచారించిన అక్కమ్మ సూరయ్యవల్లనే కారణాన్ని విని నిర్ఘాంతపోయింది.

పక్షవాతం రాగానే డాక్టరు కోసమని వెళ్ళిన సూరయ్య అక్కడే రిజిస్ట్రారు ఆఫీసులో వీలునామా వ్రాయించి రిజిస్టరు చేయించాడట! అందులో తన కొడుకుకూ, భార్య అక్కమ్మకూ, కూతురుకూ సమంగా ఆస్తి అంతా మూడు వాటాలుగా చేసి వ్రాశాడట! ఈ విషయాన్ని విన్న మరునాడే కూతురూ, అల్లుడూ రోగిష్ఠి సూరయ్యను వదిలివేసి వేరే కాపరం పెట్టారట. కొడుకును మేనమామ తీసుకొనిపోయి, తనను సంరక్షకుడుగా నియమించిన సూరయ్యతో ఘర్షణపడి, ఊళ్ళోనే ఉన్నా ఆ పిల్లవాణ్ణి కనీసం తీసుకొనివచ్చి చూపనైనా చూపటం లేదట. ఈ విషయం చెపుతూ సూరయ్య పిల్లవాణ్ణి తలుచుకొని కళ్ళవెంట బాష్పాలు విడిచాడు. అక్కమ్మ నీరైపోయింది. పిల్లవాడి మేనమామ దగ్గరికి వెళ్ళి ప్రాధేయపడ్డది, "బ్రతికి ఉన్నంతవరకు తండ్రీ కొడుకుల్ని వేరు చేయవద్దని." ఏ ముందు ఆలోచన ఆ మెదడులో పని చేసిందో, పిల్లవాణ్ణి అక్కమ్మ చేతికి ఇచ్చి పంపాడా మేనమామ. కొడుకును పొట్టమీద పడుకోబెట్టుకొని, పైన పరిచినిద్రించాడా తండ్రిసూరయ్య. అక్కమ్మకళ్ళు తృప్తితో ప్రకాశించి కొలుకుల గుండా ద్రవించాయి.

* * * *

వేణుగోపాలస్వామి ఆలయం అక్కమ్మ సేవ వల్ల పరిశుభ్రతకు నోచుకుంది, ప్రహరీలు పోయిన పాతికేళ్ళ తరవాత. అక్కమ్మ దినచర్యలో ఎక్కువ భాగం వేణుగోపాలస్వామి సేవ కంకితమై పోతూండేది. ఒంటరిగా ఉండిపోతున్న అక్కమ్మకు తోడుగా, నీడగా నిలిచి, ఒక్కడే వందమంది పెట్టు, తీరికగా సేవలు చేయించుకుంటున్నాడా శేషశయనుడు. ఉదయ సంధ్యలో ఉపచారం చేసి సాయం సంధ్యలో సాన్నిధ్యంలో మనసారా కొలిచి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి పోతుండేది అక్కమ్మ.

ఆమె భగవత్సేవ ఆ ఊరిలో ఎంతమందినో నవ్వించింది. "ఏమి టీ వేషం? అంతా భక్తే?" అన్నారు కొందరు. "అంతేరా నాయనా! ఒంట్లో ఓపికపోతే వినటానికి మిగిలేవి పురాణాలేగదా!" అన్నారు వయస్సు మళ్ళిన కుర్రవాళ్ళు.

"ఆ దేవుడికి ఇంతకన్నా భక్తురాలు ఎవరూ కనబడలేదురోయ్!" అన్నారు భజనపరులు కొందరు.

"ఎంత నయగారంరా! కన్నెత్తి చూడదూ? తలెత్తి నడవదూ? ఏమి నంగనాచిరా?" అంటూ మరికొందరు అవహేళన చేశారు చేతనైనంతవరకు. "దేవదాసి" అంటూ చమత్కరించారు చిట్టి కరణం



రాలిన గులాబీ

చిత్రం — డాక్టర్ వి. సత్యనారాయణ (హైదరాబాదు)

గారు. ఆ చమత్కారంలోని కారానికి అంతా నవ్వి అతగాణ్ణి మెచ్చుకున్నారు.

అక్కమ్మలో వచ్చిన మార్పుతో పూజారి ఆచారిఓ విధంగా ఆశ్చర్యపోయాడు అందరిలాగే. ఈ ఆచార్యవర్యుడూ ఆనాడు సైకిళ్ళపైన "సై" అంటూ వెళ్ళిన ప్రబుద్ధులలోనివాడే! ప్రతిరోజూ విష్ణుపాదాలివ్వటానికీ, తీర్థప్రసాదాలివ్వటానికీ వెళ్ళినప్పుడు ఆ పూజారి కళ్ళు ఆమె వక్షఃస్థలం మీద పడి చరితార్థులమయ్యామని అనుకొనేవి. తీర్థం ఇవ్వ ఉద్ధరిణ పొరపాటున ఆమె మునివేళ్ళ ముద్దు పెట్టుకుని తప్పుకొనేది. విష్ణుపాదాలు ఆమె మొన్నుదుట

స్పృశించి సంతృప్తి పడేవి. అక్కమ్మ ఎరగదు కాని ఆచారి పెదవులు ఏవో మాట్లాడటానికి ప్రయత్నం చేవి; చూపులేమో వెతకటానికి ఆరాట పడేవి గుండె దడదడలాడి కుములుతూండేది.

శనివారం శనివారం అక్కమ్మ ఆ వేణుగోపాల మూర్తి పాద సన్నిధిలో పరవశుడై ఉన్న రామభక్త ప్రసన్నాంజనేయునికి ఆకుపూజ చేయించేది; నూరయ్య కొడుకును మేనమామగారి ఇంటినుంచి తప్పకుండా తీసుకొనివచ్చేది. వాణ్ణి ఎదురుగా కూర్చుండబెట్టి పూజ జరిపించేది. తాను నామమాత్రమే. వాడు యజమాని. దైవపూజ అయిన తరవాత ప్రసాదం వాడి చేతుల మీదుగా స్వీకరించి కళ్ళకు అద్దుకునేది. "అమ్మా, వెళ్ళి వస్తా"నని చెప్పి బయలుదేరేవాడు వెంకటాద్రి. అక్కమ్మ అమ్మ అయిపోయి ప్రేమించేది. ఎంతగా మేనమామ వాణ్ణి అక్కమ్మ దగ్గరికి చేరనీయ రాదని ప్రయత్నించినా, ఇక్కడ మాత్రం అడ్డపెట్ట లేక పోయేవాడు. 'అదీ మంచిదేనేమోలే ఎందుకైనా?' అనిపించి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడా పెద్ద మనిషి.

ఓరోజు బ్రహ్మాండంగా మబ్బులు కమ్ముకున్నాయి. ఆచారి అర నిమిషంలో పూజ ముగించి గంట కొట్టేశాడు. తలుపులు మూసి, తాళం వేసి, వెళ్ళిపోదామని తాళం తీసుకుంటూండగానే అక్కమ్మ ఎదురుగా కనిపించింది ముకుళిత హస్తాలతో. 'గడిచ్చిన భక్తేనా?' అని అక్కసు కక్కుకుంటూ తీర్థం ఇవ్వటానికి పాత్ర

# నివేదిత

పుచ్చుకున్నాడు. ఆచారిలోని ఆచారి నవ్వాడు. ఉద్రేకిణి అక్కమ్మ మునివేళ్ళు ముద్దుపెట్టుకోలేదు. కొంచెం మృదుత్వాన్ని మించి తాకింది. ఆ పవిత్ర పాదోదకంపై గల భక్తి భావం, ఆ పవిత్రోదకం చేతిలో పడగానే భగవద్దర్శనం అనిపించింది అంతస్సులో. విష్ణుపాదాలు అక్కమ్మ శిరస్సుకు గట్టిగా తగిలి తాడించేసి హెచ్చరించాయి. వైకుంఠద్వారంలో ఉన్నట్లు మాత్రమే భావించగల ఆమె పవిత్ర హృదయం ఈ తాపుతో ధన్యమైనట్లు మాత్రమే గ్రహించుకుంది. అంతలో ఉరుములతో, మెరుపులతో వర్షం ప్రారంభమయింది. "అక్కమ్మా! ఈ వానలో ఇప్పుడేం వెళతావు? కాస్సేపు మా ఇంట్లో కూర్చుని వెళ్ళు" అని చెప్పి ఆచారి గుడి తలుపులు మూశాడు. ఆ ఆవరణలోనే ఉన్న ఆచారి ఇంటికి వెళ్ళింది అక్కమ్మ తలదాచుకోవటానికని.

భార్యా పిల్లల్ని అత్తవారి ఇంటికి పంపిన ఆచారి అక్కమ్మతో ఒంటరిగా ఉన్నాడా ఇంటిలో. ఇంత కాలం మరుగున పడిఉన్న ధైర్యస్థైర్యాలు ఆచారి మీదికి తిరిగి వచ్చాయి. "ఏమంత పెద్ద పతివ్రత! అయినా ఎంతమందిని ఎరగం?" అనుకొన్న ఆచారి పొడిపొడిగా దగ్గాడు. గొంతు సవరించుకొన్నాడు; నెమ్మదిగా కార్యోన్ముఖుడయ్యాడు.

"కూచో, అక్కమ్మా! అట్లాగే నిలబడ్డావేం?" అంటూ చాప ఇచ్చాడు. చాప పరుచుకొని కూర్చుంది అక్కమ్మ. వర్షం జోరుగా సాగింది.

ఆచారి కబుర్లు మొదలుపెట్టాడు. తనంతట తనేదో చెప్పుకుపోతున్నాడు. అక్కమ్మలో ఆ కబుర్లకు అయిష్టం కాని, ఆసక్తి కాని ఏభావమూ గోచరించ లేదు అతనికి. ఆచారికి ఈ స్థితి కొంత బెరుకు ఇచ్చింది. ఇక ప్రశ్నలు వేయసాగాడు. "నూరయ్య కొడుకు ఇంటికి వస్తాడా?" అన్నాడు. ఆ మాటకు అక్కమ్మ ఎంతగానో బాధ పడ్డది. సమాధానం రాకపోవటాన్ని ఆసరాగా తీసుకొని ఆచారి, "ఆఁ! అయినా ఎందుకు వస్తాడ్లే! వాడేమైనా నీ కొడుకు అవుతాడా?" అని తానే సమాధానం చెప్పుకొన్నాడు.

ఆఖరికి "అక్కమ్మా! ఏమీ అనుకోవుగదా, ఓ మాట అడగాలనుంది?" అన్నాడు. అక్కమ్మ మాటల లోని అంతర్యభావాన్ని అర్థం చేసుకోగల స్థితిలో లేని ఆచారి అక్కమ్మ లేచిపోయిననాటి ప్రసక్తి తీసుకొని వచ్చాడు. "నాకేళ్ళు వేసుకొని ఎంతగానో పరిగెత్తాము. దొరికితేగదా! ఎట్లా ఎట్లా వెళ్ళావేమిటి? కాస్త చెబుదూ!" అంటూ చుప్పుకొట్టి నవ్వుతున్నట్లు నవ్వి ఎదురుగా ఉన్న మంచంమీద కూర్చున్నాడు.

అక్కమ్మ హృదయం అసహ్యంతోనూ, నిర్లిప్త భావంతోనూ నిండిపోయింది. జారిన స్త్రీ జీవిని సహకరించి పైకి లాగటానికి ప్రయత్నించే యోగ్యతే లేక పోగా ఇంకా దిగజారనీయటానికి సర్వసన్నాహాలూ చెయ్య గల ఈ దయామూర్తుల్ని, సౌభ్రాతృపరాయణుల్ని చూచి ఏవగించుకొంది.

సానపట్టినకొద్దీ కాంతులీనే శక్తి వజ్రాని కెలాగ ప్రసాదించాడో అలాంటి శక్తినే మాతాదు భేదంలో భగవంతుడు తన సృష్టి కంతటికీ ప్రసాదించియున్నాడు! విహ్వలభావంతోనూ, జుగుప్సతోనూ నిండి పోతున్న అక్కమ్మలో ఏదో నూతన భావ పుంజం కాంతి పుంజంలా మెరిసింది. ఆమె హృదయం జాలితో నిండిపోయింది. అది కరుణగా మారింది. అక్కమ్మ పెదవులపై చిరుదరహాసం మెదిలింది. ఆచారి హృదయం ఆనందంతో వెల్లివిరిసింది. భగీరథుడు గంగాదేవిని ప్రసన్నను చేసుకొన్నప్పుడు పడ్డంత సంతోషం వచ్చేట్టున్నది, ఆ అక్కమ్మ చిరునవ్వుగా ప్రసన్న సుందరవదనాన్ని వీక్షించేసరికి. అక్కమ్మ తలెత్తి ఆచారి వైపు చూచింది. ఆచారి ప్రచండ వేగంతో స్వర్గధామంలోకి జారబడబోతున్నాడు. "అయ్యయ్యో!" అని వినిపించింది అక్కమ్మ గొంతుక. ఆచారి మతి పోయింది. నిశ్చేష్టుడైపోయాడు!

"ఏ జన్మలో చేసుకున్న పుణ్యం వల్లనో ఈ జన్మ అంతా భగవంతుడి పరిచర్య చేస్తూ తరించే మహదవకాశం నీకు లభించింది. అందరికీ దక్కదు, అన్నా, ఈ అదృష్టం! అందరికీ తిండికనీ, తిప్పలకనీ దేవులాడు కోవటంతోనే తీరిపోతుంది ఈ జీవితమంతా. తిండి తిప్పలు పడకుండా దేవుడు తన సేవలోనే నీకు అది సమకూర్చాడు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి కాని, ఈ దౌర్భాగ్యపు కథల వల్ల కలిసివచ్చేది ఏముంది? ఎవరి కర్మాన వాళ్ళు చరిస్తారు. ఆ పాపపు కథలు వినటం వల్ల మనకు కలిసి వచ్చేది పాపమే కాని పుణ్యం కాదు గదా! మానవుడు ఎలాగ నీతి తప్పి, గాడి వదిలి అధోగతి పాలైపోతాడో తెలుసుకోవటానికి నాబోటి

నిరీక్షణ

చిత్రం — కె. శేషగిరిరావు (విజయనగరం—1)



జీవితాలు ఎన్నో కనిపిస్తానే ఉంటాయి. కాని, మానవుడు భ్రష్ట ఫలితాన్ని గ్రహించకుండా ఇంకా ఆ కంచె తొక్కడానికే ఉబలాటపడిపోతాడు ఎందుకో? జీవితాన్ని చరితార్థం చేసుకోవటానికి ఉన్న సదవకాశాన్ని జార విడుచుకోవటం తప్ప. ఈ ఆలోచనల్ని మాని వెయ్యన్నా! వర్షం వెలిసింది. వెళ్ళి వస్తాను" అని చెప్పి మెరుపులా వెళ్ళిపోయింది అక్కమ్మ.

ఆచారి తనను తాను తెలుసుకొనేసరికి అక్కమ్మ లేదు అక్కడ. ఆమె సంబోధించిన "అన్నా!" అన్న మాటలో గంభీరతా గర్భితమైన మహాశక్తి ఆచారి హృదయగతమైన పాపాన్ని కాష్ఠంలా కాల్చి వేసింది. ఆచారి దేహమే తేలికై పోసాగింది. పుట్టంధునికి అక స్మాత్తుగా చూపు కలిగినా, మహాబధిరునికి చెవుడు అంతా చప్పున జారిపోయి శ్రవణశక్తి కలిగినా ఎలాంటి అనుభూతి కలుగుతుందో దాదాపు అంతటి అనుభూతి ఆచారిని తబ్బిబ్బు చేసింది. అక్కమ్మ అడుగుజాడలకు నమస్కరించాడు. దేవాలయపు తలుపులు శరవేగంతో బోయి తెరిచి వేణుగోపాలమూర్తి పాదాలపై వాలి పోయాడు, క్షమించమని ప్రార్థించటానికీ, క్షమిం చవా? అని వేడుకోవటానికీ కూడా లోపని నిశ్చల నిర్మలాకాశం వంటి హృదయంతో.

ఎప్పుడో వాళ్ళమ్మ వెంకాయమ్మ పాడుకుంటూండే పాటలన్నీ ఆమె గొంతుతోనే వినిపిస్తూ జ్ఞాపకానికి అందాయి. జయదేవుని గీతగోవిందంలో శ్లోకాలన్నీ అమ్మ నోటనే వినిపిస్తూ అతని హృదయతంత్రుల్ని మీటసాగాయి. పురిటిలోనే పోయిన తండ్రిలేని లోటు కనబడనీయకుండా పెంచి పెద్దను చేసి, పాతికేళ్ళ కింద పోయిన అమ్మ జ్ఞాపకానికి వచ్చింది. దుఃఖం పెల్లుబికింది. "కృష్ణా!" అనుకున్నాడు. మళ్ళీ వాలిపోయాడు ఆ దివ్య చరణాలమీద, "త్వమేకం శరణ్యం" అంటూ.

* * *

వెంకటాద్రి జన్మతః తెలివి తేటాకలవాడు. వాడు కొంచెం బుద్ధి తెలుస్తున్నప్పుడల్లా తనకు అమ్మ లేదనీ, అమ్మకాని అమ్మ, అమ్మంతఅమ్మ, అంతకు మించినా మించగలంత అమ్మ, మరో అమ్మ ఉన్న దనీ గ్రహించాడు. ఇంకా కొంచెం బుద్ధిసాగినప్పుడల్లా తన కొడుకు చదువు సంధ్యలకని వసు ఉన్న ఆరాటమూ శ్రమా అంతే ఈడుగల తనవట్ల తన మామకు లేవనీ, కానీ తనకు చదువురావటానికన్నా రాకపోవటమే అతనికి ఇష్టమనీ తెలుసుకున్నాడు. అటూ ఇటూ వాళ్ళూ వీళ్ళూ తనను గురించి ఎందుకో సానుభూతి చూపుతూండేవాళ్ళు. తలిదండ్రులు లేని పిల్లవాడని చాలాకాలం వినిపించేవి వాళ్ళ సానుభూతి వాక్యాలు. ఈ మధ్య ఆ ధోరణి మారింది. అంత అప్పగించిపోయినా సన్యాసిని చేస్తున్నా డీ మేనమామ; ఒక్క అక్షరం ముక్క అయినా చెప్పించటం లేదన్న మాటలు వినిపించసాగాయి. తన మేనమామ కొడుకు గోపయ్యను హైస్కూల్లో చేర్పించటానికని ఆష్టం వచ్చిన గడ్డి కంపా తిని ఎలాగో అలాగ చేర్పించాడు. ఎవరైనా "వీణ్ణి ఇట్లాగే వదిలావేం?" అంటే, "వాడు రోగిష్టి; చదువు అబ్బదు; బ్రతికి బట్ట కడితే అంతే చాల్నే!" అనేవాడు. ఒకళ్ళిద్దరు "వాణ్ణి బ్రతకను కూడా బ్రతకనీయడా, ఏం?" అని అర్థప్రకాశంగా అన్న మాటలు వెంకటాద్రి చెవిని పడ్డాయి. ఇదంతా ఏవో తెలియని గోడుగా వెంకటాద్రిని బాధించసాగింది.

ఒకనాటి శనివారం పూజ అయిన తరవాత ప్రసాదాన్ని తీసుకొని అక్కమ్మ, వెంకటాద్రికి "వెళ్ళు, నాయనా!" అని చెప్పి తనదారిని తాను బయలుదేరింది. కొంతదూరం పోయాక వెనక ఎవరో వస్తున్నట్లయి తిరిగి చూచింది. వెంకటాద్రి! "ఏం, నాయనా?" అంది అక్కమ్మ. "అమ్మా!" అని ఆగిపోయాడు. అక్కమ్మలోని అమ్మ పెల్లుబికి బయటికి వచ్చింది. అక్కమ్మ కళ్ళలో కొత్త వెలుగు వచ్చి నిలిచింది. పాతాళ గంగ పైకి ఉబికినట్లు అమృతం ఊరి ఆమె హృదయాన్ని పూరించింది. వెంకటాద్రిని ఆలింగనం చేసుకొని హృదయానికి హత్తుకుంది.

అతని కళ్ళలోని నీటిబొట్లు మీదపడగానే నీరై పోయింది అక్కమ్మ. "ఏమిటి, నాయనా?" అంటూ ఆత్రంగా చూచింది వెంకటాద్రిని. "అమ్మా, నేను నీ దగ్గరే ఉండిపోతాను!" అన్నాడు వెంకటాద్రి. "అంతకన్నానా, నాయనా!" అంటూ దగ్గిరికితీసుకొంది. ఆనంద భయోద్వేగాలు ఆమెను ఆవహించాయి. ఈ విచారని బాంధవ్యాన్ని ఎవరేనా తెంచుకుపోతారేమో నని గిలగిలలాడింది.

వెంకటాద్రిని వక్షంలో పదుకోబెట్టుకొని తల నిమురుతూ అక్కమ్మ అతని సంగతి సందర్భమూ నెమ్మదిగా వింది. గజగజలాడిపోయింది. వెంకటాద్రినిఇక ఏమైనాసరే తిరిగి మేనమామ ఇంటికి పోనియ్యరాదను కొంది. ఆ వంశాంకురాన్ని మహావృక్షంలా పోషించి పరిరక్షించవలిసిన భారం తనదేనని నిర్ణయించుకొంది.

మరునాడు పెద్ద మనుష్యుల దగ్గిర జరిగిన పంచాయతీలో బయటపడ్డ విషయం, వెంకటాద్రికి ఇప్పుడున్న ఆస్తి వాళ్ళ నాన్న చేసిపోయిన అప్పు తీర్చడానికి సరిపోయిందనీ, బాగా బ్రతికినవాడని అతని పేరు రచ్చకీడ్వకుండా అంతా ఆ మేనమామ ఆ ఆస్తిమీద వస్తున్న ఆయివేజుతో అది తీర్చివేస్తున్నాడనీ, వెంకటాద్రిని మేనల్లుడన్న మమకారంకొద్దీ పోషిస్తున్నాడేగాని, వాడి ఆస్తివిబట్టి కాదనీ. నారయ్య ఎరిగి ఎర్రని ఏగానీ అప్పు చేసినట్లు ఎవరూ ఎరగరు. కాని, ఎదురుగా నారయ్య చేవ్రాలుతో ఉన్నవి, వెంకటాద్రి మేనమామ తీర్చటం వల్ల, అతని పేర ఆర్డరు వేయించుకున్న పత్రాలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. వెంకటాద్రి ఆస్తి అంతా అమ్మి తీర్చినా ఇంకా కొరవే ఉంటుంది గాని మిగులు ఉండదు!

అక్కమ్మ అన్నీ ఒప్పుకొంది. న్యాయాన్యాయాల ప్రసక్తి అవసరానవసరాల ప్రసక్తి అక్కరలేదంది. తన ఆస్తి వెంకటాద్రి ఆస్తికి హామీ పెట్టి ఆ అప్పు అంతా తీర్చివెయ్యమంది. వెంకటాద్రిని మాత్రం తన పరం వెయ్యమని కోరింది. "మారుతల్లి తల్లి అవుతుందా?" అని వికవు నవ్వు నవ్వాడు వెంకటాద్రి మేనమామ. అంత త్యాగం చేసిన వ్యక్తిని అనుమానించటం సబబు కాదని అంతా చీవాట్లు పెట్టారు. వెంకటాద్రి అమ్మ దగ్గిరే ఉండిపోతానన్నాడు. అక్కమ్మ తన ఆస్తి అంతా హామీపెట్టి వెంకటాద్రి ఆస్తి అమ్మి వాణ్ణి ఋణవిముక్తుణ్ణి చేసింది. అనాటి



తొలి అడుగు

చిత్రం—పి జనార్దనరావు (రోర్నర్ల)

నుండి వెంకటాద్రి అక్కమ్మకు స్వంత కొడుకు అయ్యాడు.

* * * *

వెంకటాద్రి పెరిగి పెద్దవాడయ్యాడు. చక్కగా చదువుకున్నాడు. ప్రజ్ఞాపాటవాలతో ప్రయోజకుడు అయ్యాడు. అక్కమ్మ తీర్చి దిద్దినఒరవడిలో పెరిగి పెరిగి యోగ్యుడనిపించుకున్నాడు. నారయ్యను అన్ని విధాలా జ్ఞప్తికి తెచ్చేవాడు, అతనిలోని అవస్వరాలను మినహాయించి. వెంకటాద్రికి వివాహం జరిపించింది అక్కమ్మ. భర్తకు తగిన భార్య అనిపించుకుంది సువర్ణ. పెళ్ళికి ముందు వెంకటాద్రికి హితబోధ చేసింది అక్కమ్మ. ఆ బోధ సారాంశం అంతా, భగవత్సృష్టిలో అందం ఏ రూపంలో ఉన్నా దాన్ని ఆదరించి, ఆ ప్రజ్ఞామూర్తి సృష్టికర్తకు ప్రణమిల్లాలనీ, అసూయారాగద్వేషాలతో ఆ అందాన్ని భ్రష్టం చెయ్య

(తరువాయి 32 వ పేజీలో)

## గమనిక

మామూలుగా ప్రచురణకు రచనలు ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు 2'కు పంప వలసి ఉన్నది పోటీలకు అయితే కవరుమీద పోటీ పేరు స్పష్టంగా వ్రాయాలి.

## నివేదిత

(29 వ పేజీ తరువాయి)

రాదనీ, అంతః శత్రువుల్ని జాగ్రత్తగా కనిపెట్టి మందలించాలనీ. వెంకటాద్రికి ఇది ఎంతవరకు బోధ పడిందోగాని వినమ్రుడై దాన్ని ఆదేశంగా స్వీకరించాడు.

శ్రీరామనవమికి సీతారాముల కల్యాణం చేయించ మంది వెంకటాద్రిని అక్కమ్మ. వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణం అంతా పందిళ్ళు వేయించి వైభవోపేతంగా సీతారాముల దివ్యమంగళ మూర్తులకు వివాహం జరిపించాడు వెంకటాద్రి. పసుపు బట్టలతో ఉన్న వధూమణి సీతమ్మ తల్లి రామయ్య తండ్రిని ఓ రకంట చూచినట్లయి నవ్వింది అక్కమ్మ, "ఓరచూపు చూచేను రాఘవా" అని హెచ్చరించి. రామయ్య తండ్రి నిండుగా నవ్వాడు. అక్కమ్మ నవ్వింది. ఏమిటా పిచ్చినవ్వు అని విస్తుపోయింది కోడలు. వెంకటాద్రికి ఆ నవ్వులో గల తన్మయతా, అంతకుమించిన అర్థం కానిదీ మరేదో సుస్పష్టంగా గోచరించి తెల్లపోయాడు.

అక్కమ్మకు ఆకాశం అంతా పందిరి అయి భూమి అంతా కల్యాణ వేదిక అయి కనిపించసాగింది. మహా ప్రకృతి సీతమ్మ తల్లి, మహా పురుషుడా రామయ్య తండ్రి! ఈ ప్రకృతి పురుషుల సంయోగాన్ని అంతర దృష్టితో సువిశాలసుందరతమ మాధుర్యమయ మహానందానుభూతితో వీక్షిస్తున్న అక్కమ్మ పైమరిచింది.

ఇంతలో "రామయ్య పెండ్లికొడుకాయెను; మన సీతమ్మ పెండ్లికూతురాయెను" అంటూ భజంత్రీలు తలంబ్రాల పాట పాడసాగారు. ఆ నాగస్వర వాద్యం రేపిన సంగీత వీచికలు అక్కమ్మ కర్ణపుటాలను అదిరించి ఆమెను అలరించి ఈ లోకానికి లాక్కువచ్చాయి. సీతమ్మ తల్లి ఆజానుబాహుడు అరవింద దళాయతాక్షుడు అయిన శ్రీరామచంద్రుని మూర్ధం పైన అక్షతలు దోసిలితో పోసింది. నల్లని రామయ్య పచ్చని రామయ్య అయ్యాడు. అంబరం అంతా పీతాంబరమై పోయింది. తామరస నేత్రాలు, మేలిమి బంగరు ఛాయనే అపహసించే మేను, మేలి ముసుగులలో దాచిన మూర్తి, లలిత లావణ్యము మెరుస్తుండగా సిగ్గుతో తల ఒద్దికగా వంచిన పెళ్లికూతురు సీతమ్మ తలపై బంగరు అక్షతలు ఓరగా చూస్తూ ధారగా పోశాడు రామయ్య. ఆ బంగారం అంతా ఈ బంగారంతో కలిసిపోయి సీతాదేవి లక్ష్మీదేవే అయిపోయింది. అక్కమ్మ నవ్వుకుంది. విరగబడి నవ్వింది.

"అమ్మా! ఇంటికి వెళదామా?" అన్నాడు వెంకటాద్రి రాత్రి సేవలన్నీ పూర్తి అయి సీతారాములు శయ్యపై చేరి పవళించిన తరవాత.

"ఈనాటినుంచీ నా ఆవాసం ఇదే, నాయనా! ఈ ప్రాంగణం వదిలి రాలేను" అంది అక్కమ్మ. నిశ్చేష్టుడై పోయాడు వెంకటాద్రి. ఆ రాత్రి అమ్మతో అక్కడే గడిపాడు.

నాలుగవ జాము ప్రవేశించటంతోటే నిద్ర మేలుకొంది అక్కమ్మ.

"కౌసల్యా సుప్రజారామ, పూర్వాసంధ్యా ప్రవర్తతే" అని హెచ్చరించింది.

"ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవిన్ద, ఉత్తిష్ఠ గరుడధ్వజ, ఉత్తిష్ఠ కమలాకాన్త, త్రైలోక్యం మంగళం కురు" అని అర్థించింది.

"తవసుప్రభాత మరవిందలోచనే, మాతా!" అంటూ సీతమ్మతల్లిని కేకవేసింది.

"మేలుకో లోకేశ మేలుకోవయ్య! ముదిత సీతమ్మను మేల్కొలుపవయ్య" అంటూ నవ్వుకుంది. సీతమ్మ రామయ్యను చూచి నవ్వింది. సీతారాములు ఆలయం తలుపులు తెరవకుండానే అక్కమ్మను చూచి నవ్వారు. అక్కమ్మా నవ్వింది నమస్కరిస్తూ.

పూజారి ఆచారి లేచి స్నానం చేసి వచ్చాడు. ఆలయం తెరిచాడు. షోడశోపచార పూజ చేశాడు. ఆరగింపు పాట పాడింది అక్కమ్మ. హారతి ఇచ్చాడు ఆచారి. నీలమేఘ శ్యాముడు నిగనిగలాడాడు; తరళాయతాక్షి ధగధగ మెరిసింది. "కొలువు తీర్చిన రాము, గుణగణమ్ముల దీప్తి" కోకిల అయి ఎలుగెత్తి కీర్తించింది అక్కమ్మ.

ఆనాటినుంచి అక్కమ్మ ఆలయ ప్రాంగణంలోనే నివసించసాగింది. ప్రతిరోజూ వేకువనే లేచి ఆలయ ప్రాంగణం అంతా శుభ్రపరిచి ముగ్గులు తీర్చి మేల్కొల్పులు పాడి, ఉషః కాలంలోనే ఆ దివ్య మంగళ మూర్తి దర్శనం చేసుకొనేది. ఆ మధురమూర్తి ఆరగింపగా మిగిలిన నైవేద్యం మాత్రమే ఆమె భుజించేది. వెంకటాద్రి ప్రతి వేకువలోను లేచి స్నానాదికాలు పూర్తి చేసుకొని భార్యతో వచ్చి అమ్మకు పాదాభివందనం










తరావతు కట్టుగల స్టాకిస్టులు, సేల్సుమెన్ కావలెను.

చేసి ఆకేస్తులు తీసుకొని వెళ్ళేవాడు. భగవన్నివేదనకు కావలసిన సామగ్రి అంతా నిండుగా సమకూర్చేవాడు. ఇక ఆవారి పద్ధతే మారిపోయింది. మర్రిచెట్టుకింద వ్యాఖ్యానాలు చెప్పే మాటలు మరిచిపోయాడు. తన జీవితంలో వ్యర్థం చేసిన కాలాన్ని లెక్కకట్టి భగవత్సేవ బాకీతో తీర్చుకుంటున్నాడు.

వైకుంఠ ఏకాదశినాడు ద్వార దర్శనం గొప్ప వేడుకతో జరిపించ నిశ్చయించాడు వెంకటాద్రి. వైకుంఠ ద్వారంలో దర్శనం ఇస్తున్న లక్ష్మీ సమేతుడు శ్రీ మహావిష్ణువును తనకు వచ్చిన అన్ని శ్లోకాలతోను, పాటలతోను, పద్యాలతోను, మహదావేశంతో కీర్తించింది అక్కమ్మ. ఊరేగింపు కోసం వేణుగోపాల మూర్తిని గరుడారూఢుణ్ణి చేశారు. వాహనాన్ని భుజాలపై ఉంచుకున్నారు వాహకులు.

గరుడారూఢుడైన విష్ణుమూర్తి లక్ష్మీసమేతుడై పైకి వెడుతున్న భావించిన అక్కమ్మ తనను విడిచి వెళ్ళుతున్నాడా మధురమూర్తి అన్న కించి భ్రాంతితో ఆ ఎడబాటు సహించలేకపోయింది. చేతులు రెండూ పైకెత్తి జోడించింది. నిమీలిత నేత్ర అయింది. ఉద్వేగంతో పలికిపోయింది.

"ఓం నమస్తే సతే తే జగత్కారణాయ!
నమస్తే చితే సర్వలోకాశ్రయాయ!
నమోऽద్వైత తత్త్వాయ ముక్తిప్రదాయ!
నమో బ్రహ్మణే వ్యాపినే శాశ్వతాయ!
త్వమేకం శరణ్యం, త్వమేకం వరేణ్యం
త్వమేకం జగత్పాలకం స్వప్రకాశం
త్వమేకం జగత్కర్తృ పాతృ ప్రహర్తృ
త్వమేకం పరం నిశ్చలం నిర్వికల్పం

త్వమేకం శరణ్యం త్వమేకం శరణ్యం"

అంటూ ఎలుగెత్తి ఆక్రోశించి నిశ్చల నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళిపోయింది.

ఊరేగింపు కోసం వెళ్ళిన వేణుగోపాలస్వామి అక్కమ్మ చేర్చి కూర్చిన చేజేతుల అలంకరించిన మందారహారంతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ, చిరునవ్వులు చిందిస్తూ ఊరంతా స్వయంగా ఏ పరమ రహస్యమో వినిపించి వచ్చాడు. అయినా అక్కమ్మ కనులు తెరవలేదు.

అక్కమ్మ పాంచభౌతిక దేహాన్ని పునీతం చేశాడు అగ్నిదేవుడు. రూపురేఖలు లేని అక్కమ్మ ఆత్మ పరమాత్మను చేరింది.

ఆవారి హృదయం తీరని బాధతో విలవిల్లాడింది. తెల్లవారితే దేవుడికి ఎంత కొరతో! తెల్లవారకుండా మేల్కొలుపులు పాడి రామయ్యను నిద్ర లేపే దెవరు? ఆ రాత్రి అంతా నిద్రపట్టలేదు ఆవారికి. పట్టీ పట్టనట్టుగా మూడవ జామున కన్ను మూశాడు.

"లేవాయె నీవేళ శ్రీ వేణుగోపాల వెన్న తిందువు గాని లేరా!" అంటూ అక్కమ్మ కంఠం వినిపించింది. ఉలిక్కిపడి లేచిన ఆవారి యాంత్రికంగా స్నానం చేసివచ్చి గుడి తలుపులు తెరిచాడు. అక్కమ్మ స్వయంగా వేణుగోపాలుని పాదపూజ చేస్తూ కనిపించింది. వేణుగోపాలుడు ఆమె స్వయంగా అందిస్తున్న వెన్న ఆరగిస్తున్నాడు!

చేతులు జోడించిన ఆవారిని చూచి అక్కమ్మ నవ్వినట్టయింది.

ఆవారి కంఠ మెత్తి—

"చరణము సోకినట్టి శిల జవ్వని రూపగు టొక్క వింత, సు
స్థిరముగ నీటిపై గిరులు దేలిన దొక్కటి వింత, గాని మీ
స్మరణ దనర్చు మానవులు సద్గతి జెందిన దెంత వింత! యీ
ధరను ధరాత్మజారమణ! దాశరథీ! కరుణా పయోనిధీ!"

అంటూ కీర్తించా డా వేణుగోపాలమూర్తిని.

గుడి పక్కనున్న రావిచెట్టు పైని పక్షి సముదాయం కిలకిలారావాలు చేసింది. ఆ విహంగాలు రెక్కలు కొట్టి బాజాలు ఏర్పరిచాయి. చెట్టు కదిలి వింజామరలు అమర్చాయి. నక్షత్రాలు హారతు లెత్తాయి, ఆ మురళీ మూర్తి వేణుగోపాలమూర్తికి. ★

స్త్రీ సంజీవి నెం. 1
సంతానపరిమితికి
స్త్రీ సంజీవి నెం. 2
సంతాననిధి
స్త్రీ సంజీవి నెం. 3
ముట్టునొప్పి: బుతుశూల
వివరములకు:
నాగార్జున మూలికాకుటీరము
తెనాలి—2 (ఆంధ్ర)

అందరికీ అందుబాటులో
అత్యుత్తమ సాహిత్యం *
* వైకుంఠపాళి - ద్వివేదుల విశాలాక్షి
420 పేజీలు రు 5-00
* అర్పణ - పాకల రామలక్ష్మి
384 పేజీలు రు 4-00
* పుట్టిల్లు - కె. వి. యస్. అచ్యుతవల్లి
288 పేజీలు రు 3-00
* ఎదురీత - ముద్దంశెట్టి హనుమంతరావు
164 పేజీలు రు 2-00
గాయత్రీ పబ్లికేషన్స్ ఏలూరు రోడ్ విజయవాడ-2




## ఫోటోగ్రాఫర్లకు విజ్ఞప్తి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణార్థం పరిశీలనకు ఫోటోలు పంపేవారు ఈ దిగువ సూచించిన **అంశాలు** గమనించాలని కోరుతున్నాము:

1. ఫోటోప్రింట్లు మాత్రమే పంపాలి. నెగెటివులు పంపరాదు.

2. గ్లాసీ పేపరు ప్రింట్లు పంపడం మేలు.

3. సైజు: కనీసం $2\frac{1}{2}$ అం.$\times3\frac{1}{2}$ అం. 10 అం.$\times$12 అం. క మించరాదు.

**4.** ఫోటోలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2' కు పంపవలసి ఉన్నది

5. ప్రచురణార్హం **కాని ఫోటోలు తిరిగి** పంపడానికి తగుమాత్రం **తపాల బిళ్ళలు ఉన్న,** చిరునామా కలిగిన కవరు **జతపరచవలసి ఉన్నది.**

6. **ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు** జరపడం సాధ్యం కాదు.

ఫోటోగ్రాఫర్ల సహకారం సదా **అర్థిస్తున్నాము.**